## ట్రాక్టర్ బావిలో పడి డ్రైవర్ మృతి

రేగొండ, జూన్ 9 : వ్యవసాయ భూమి చదును చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బావిలో పడి డ్రైవర్ మృతి చెందినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని రేపాక గ్రామానికి చెందిన బోయిని తిరుపతి (30) తన ట్రాక్టర్‌తో వ్యవసాయ భూమి వద్ద రోటవేటర్ చేస్తుండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పి బావిలో పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్ నడుపుతున్న తిరుపతి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## శిక్షణ ఐపీఎస్‌ల పర్యటనకు ఏర్పాట్లు చేయాలి

భూపాలపల్లి రూరల్, జూన్ 9 : 2024 బ్యాచ్ సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారుల బృందం జిల్లా పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ టీఎస్ దివాకర అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో తెలంగాణ క్యాడర్ ఐఏఎస్ అధికారులు సౌరభ్ శర్మ, సలోని ఛబ్రా, హర్ష చౌదరి, కెరోలిన్ చింగ్తియానమవి, కొయ్యాడ ప్రణయ్‌కుమార్ ఈ నెల 11, 12 తేదీల్లో జిల్లాకు రానున్నట్లు చెప్పారు. 9 నుంచి 14వ తేదీ వరకు 'తెలంగాణ దర్శన్' కార్యక్రమం కింద జిల్లాలో పలు పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలను సందర్శించనున్నట్లు చెప్పారు. డాక్టర్ కందుకూరి ఉషారాణి, కోర్సు డైరెక్టర్ వీ శ్రీనివాస్, నోడల్ అధికారులు వారి పర్యటనలో పాల్గొంటారని తెలిపారు.

## భూపాలపల్లి జిల్లాలో 2.1 మి.మీ వర్షపాతం

భూపాలపల్లి రూరల్, జూన్ 9 : జిల్లాలో సోమవారం ఉదయం 8 గంటల వరకు 2.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మహాముత్తారం మండలంలో 3.2 మిల్లీ మీటర్లు, చిట్యాల 5.6 , టేకుమట్ల 1.4, మొగుళ్లపల్లి 2.2, రేగొండ 6.4, గణపురం 2.4, భూపాలపల్లి మండలంలో 2.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు.

## ఇండ్ల పంపిణీలో అధికార దుర్వినియోగం

ములుగు, జూన్ 9 (నమస్తే తెలంగాణ) : ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో కాంగ్రెస్ నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ మాజీ చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రజల సొమ్ముతో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను రెండు రోజులుగా గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు అందిస్తున్నారన్నారు. వారి చేతుల్లోకి పట్టాలు ఎలా వచ్చాయో విచారించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను డిమాండ్ చేశారు.

## పల్లె దవాఖాన సందర్శన

ములుగురూరల్, జూన్ 9 : జేడీ మల్లంపల్లి మండలంలోని భూపాలనగర్ పల్లె దవాఖానను సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విపిన్‌కుమార్ వైద్య బృందంతో కలిసి సందర్శించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో జరుగుతున్న జాతీయ నాణ్యత ప్రమాణాల కార్యక్రమాలను పరిశీలించారు వైద్యాధికారి నాగ అన్వేశ్ ఉన్నారు.

## ఉపకరణాలకు దరఖాస్తు చేసుకోవాలి

ములుగురూరల్, జూన్ 9 : దివ్యాంగులు ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి తుల రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాటరీ స్కూటర్లు, వీల్ చైర్‌లు, ట్రై సైకిల్స్, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు, చేతికర్రలు, వినికిడి యంత్రాలు వంటి ఉపకరణాలు కావాల్సిన అర్హులైన దివ్యాంగులు ఈ నెల 18 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## జలపాతాలను సందర్శించొద్దు

ములుగురూరల్, జూన్ 9 : సోషల్ మీడియా పోస్టులను అనుసరించి జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో ఉన్న జలపాతాలను సందర్శించవద్దని జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షకాలం ప్రారంభం కావడంతో కేవలం బొగత జలపాతం మాత్రమే తెరిచి ఉందని, అటవీ శాఖ అధికారులు ఇచ్చే సూచనలు పాటిస్తూ సందర్శించవచ్చన్నారు. మారుమూల ప్రాంతాల్లో ఉన్న జలపాతాలు ప్రమాదకరమని, వాటిని సందర్శించడం ద్వారా ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. పర్యాటకులు గమనించాలని సూచించారు.

## రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

గోవిందరావుపేట, జూన్ 9 : మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సృజన్‌కుమార్ అన్నారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా సోమవారం రంగాపూర్ శివారు, కర్లపల్లి గ్రామాల రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వారసత్వం, ప ట్టా పాస్ పుస్తకాల్లో ఎలాంటి తప్పులు ఉన్నా సరి చేసుకోవచ్చన్నారు. ఆర్ఐలు సుధాకర్, రాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మేడిగడ్డ వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలి

మహదేవపూర్, జూన్ 9 : మేడిగడ్డ బరాజ్ వద్ద ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గోల్కొండ కిరణ్ డిమాండ్ చేశారు. బరాజ్ సందర్శనకు వచ్చే పర్యాటకులకు అవగాహన కోసం మార్గదర్శకాలు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మేడిగడ్డ బరాజ్ గోదావరి పరీవాహక ప్రాంతంలో ఎక్కడా ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## కడుపు నొప్పితో యువతి మృతి



నిహారిక (ఫైల్)

వాజేడు, జూన్ 9 : కడుపు నొప్పితో బాధపడుతూ యువతి మృతి చెందిన ఘటన మండలంలోని ఎడ్జర్లపల్లి గ్రామ పంచాయతీలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కొత్తూరు గ్రామానికి చెందిన చిలుకూరి నిహారిక (20)కి ఆదివారం రాత్రి కడుపు నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఏటూరునాగారంలోని ప్రయివేట్ వైద్యశాలకు తీసుకెళ్లి వైద్యం చేయించారు. వైద్యుడి సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం సోమవారం ఉదయం హనుమకొండకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోని ములుగు జిల్లా కేంద్రంలో మృతి చెందింది.

## జర్నలిస్టు కుటుంబానికి మిత్రుల చేయూత

ములుగురూరల్, జూన్ 9 : అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన జర్నలిస్టు భూక్యా సునీల్‌వీరేంద్ర కుటుంబానికి చిన్న నాటి మిత్రులు అండగా నిలిచారు. 2003-4 బ్యాచ్‌కు చెందిన అరవింద స్కూల్ మిత్ర బృందం విరాళాలు సేకరించి రూ.1.36 లక్షలు సునీల్ కుమార్తె నిత్యానందన పేరుపై పోస్టాఫీస్‌లో సుకన్య సంవృద్ధి యోజన అకౌంట్‌లో జమ చేసి పాస్ బుక్‌ను సోమవారం కొడిశలకుంటలోని కుటుంబ సభ్యులకు అందజేశారు. మలిశెట్టి స్వాతి, దుగ్గిరెడ్డి సురేందర్‌రెడ్డి, యాసం విక్రమ్‌రాజ్‌కుమార్, దొంతిరెడ్డి రాకేశ్‌రెడ్డి, అన్నం మోహన్ కుమార్, సబావత్ రాజన్న, వక్కల రమేశ్, ఎండీ రియాజ్, దొమ్మటి తిరుపతి, నూనేటి మధు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ములుగురూరల్, జూన్ 9 : మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. సోమవారం వంట కార్మికులతో ఆయన కలెక్టరేట్ వద్ద ర్యాలీ నిర్వహించి గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. కార్మికులకు గత సంవత్సరం వంట బిల్లులు, వేతనాలు, కోడిగుడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే విడుదల చేయాలన్నారు. ఆయన వెంట రాజు, రమ, ప్రమీల, భారతి, సమ్మక్క, జమున ఉన్నారు.

## పోషకాహారం అందించాలి

ములుగురూరల్, జూన్ 9 : వసతి గృహాల్లోని విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారం అందించాలని జీసీడీవో రమాదేవి అన్నారు. సోమవారం ములుగు కేజీబీవీ పాఠశాలలో వసతి గృహాల్లో పనిచేస్తున్న వంట సిబ్బందికి నూతన మెనూపై 15 రకాల ఆహార పదార్థాల తయారీలో డీఆర్‌పీలు శిక్షణ ఇచ్చారు. ఎంఈవో తిరుపతయ్య, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ జీవన ప్రియ, సిబ్బంది అర్చన, మమత, రాణి, సుగుణ, మమత, అనిత పాల్గొన్నారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ దివాకర



ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

# దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

**ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర**

ములుగురూరల్, జూన్ 9 : ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ దివాకర అధికారులకు సూచించారు. ప్రజావాణిలో భాగంగా సోమవారం ఆయన కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావుతో కలిసి 31 దరఖాస్తులను స్వీకరించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం 21, భూ సమస్యలపై నాలుగు, ఇతర శాఖలకు సంబంధించి ఆరు దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని సంబంధిత శాఖ అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించడంతో పాటు బడిబాట, ఇందిర మహిళా శక్తి పథకాలపై మంత్రి సీతక్క హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు నుంచి కలెక్టర్ దివాకర, అదనపు కలెక్టర్ సంపత్‌రావు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలో పతకాలు సాధించిన జాడి రాధిక, ఎండీ ఇమ్రాన్, జాడి వాసు జిల్లా క్రీడల అధికారి తుల రవి సమక్షంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని కలెక్టర్ శాలువాతో సత్కరించి అభినందించారు.

**గిరిజన దర్బార్‌లో వినతులు**

ఏటూరునాగారం : ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన గిరిజనులు 41 దరఖాస్తులు సమర్పించారు. ఇందులో విద్యుత్ సౌకర్యం కల్పించాలని, డిప్యూటేషన్ చేయాలని, ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని, వ్యవసాయ బోర్లకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, డీఆర్ సేల్స్ డిపో మంజూరు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఇసుక ర్యాంపులను నిలిపివేయాలని దరఖాస్తుల్లో పేర్కొన్నారు. దర్బార్‌లో ఐటీడీఏలో పనిచేస్తున్న వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

**దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి**

**– భూపాలపల్లి అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్**

భూపాలపల్లి రూరల్, జూన్ 9 : ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణిలో 22 దరఖాస్తులు వచ్చాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసినట్లు తెలిపారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పనిచేసే నాయకులు చరిత్రలో నిలిచిపోతారు

మల్హర్, జూన్ 9 : ప్రజల కోసం పరితపించి పనిచేసే నాయకులే చరిత్రలో నిలిచిపోతారని మాజీ జడ్పీటీసీ గోనె శ్రీనివాస్‌రావు అన్నారు. మాజీ ఎంపీపీ బెల్లంకొండ మలహల్‌రావు వర్ధంతి సందర్భంగా కొయ్యూర్‌లో ఏర్పాటు చేసిన విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనాడు మల్లారం సర్పంచ్‌గా మలహల్‌రావు గ్రామ స్థాయి నుంచి అంచెలంచెలుగా వివిధ పదవులు అలంకరించారని గుర్తు చేశారు. ఎంపీపీగా మండల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారని, ఆనాడు మావోయిస్టు ప్రాబల్యం ఉన్నా అభివృద్ధిలో రాజీపడలేదన్నారు. ప్రజా సేవకు అర్థం చెప్పిన మహా నాయకుడు మలహల్‌రావు అని కొనియాడారు. ఆయన చేసిన సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు అయ్యూబన్, సుంకు రాము, మల్క రాజేశ్వర్‌రావు, సమ్మయ్య నాయక్, రాజేశ్వర్‌రావు, బోయిన రాజయ్య, నాయకులు యాదగిరిరావు, తాజుద్దీన్, హరిప్రసాద్, సోషల్ మీడియా ఇన్‌చార్జి సుమన్ పాల్గొన్నారు.



మలహల్‌రావు విగ్రహానికి పూలమాల వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు పెంచాలి

**భూపాలపల్లి జిల్లా విద్యాధికారి రాజేందర్**

మహదేవపూర్ జూన్ 9 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు పెంచాలని జిల్లా విద్యాధికారి రాజేందర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి బడిబాటపై దిశా నిర్దేశం చేశారు. పాఠశాలలో ఉన్న వసతులు, సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం టెన్త్‌లో ప్రతిభ కనబర్చిన అభిరామ్, వైష్ణవి, అభినేశ్వర్, అంబటిపల్లి, కాళేశ్వరం, ఉర్దూ మీడియం పాఠశాలల విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సీఎంవో రమేశ్, ఎంఈవో ప్రకాశ్‌బాబు, కాంప్లెక్స్ హెచ్ఎం బండం రాజిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ములుగు దవాఖాన సూపరింటెండెంట్‌గా మోహన్‌లాల్



ములుగురూరల్, జూన్ 9 : ములుగు ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్‌గా డాక్టర్ మోహన్‌లాల్ నియామకమయ్యారు. ములుగు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్న ఆయన డీఎంఈ ఉత్తర్వుల మేరకు సోమవారం సూపరింటెండెంట్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. గతంలో సూపరింటెండెంట్‌గా కొనసాగిన డాక్టర్ జగదీశ్వర్ ములుగు వైద్య విధాన పరిషత్ డీసీహెచ్ఎస్ అధికారిగా కొనసాగనున్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

గోవిందరావుపేట, జూన్ 9 : మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 77 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించామన్నారు. వారందరికీ రూ.65వేల జరిమానా, మరో ఐదుగురికి మూడు రోజుల పాటు జైలు శిక్షను న్యాయమూర్తి జోత్స్న విధించినట్లు చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, వాహనాల తనిఖీలు నిత్యం కొనసాగుతాయన్నారు.

## ఇంటింటా మలేరియా సర్వే

వాజేడు, జూన్ 9 : వాజేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని పెద్దగొల్లగూడెం ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ వైద్యాధికారి తరుణ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సోమవారం ఇప్పగూడెంలో ఇంటింటా మలేరియా సర్వే నిర్వహించారు. గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. గ్రామస్తుల నుంచి రక్తపూతలు సేకరించారు. పేరూరు గ్రామంలో కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు సీజనల్ వ్యాధులపై హెచ్ఈవో పాయం వేణుగోపాలకృష్ణ అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్స్ కోటిరెడ్డి, వెంకటరమణ, ఏఎన్ఎం లలితకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు సాయం

మంగపేట, జూన్ 9 : మండలంలోని మల్లూరు గ్రామానికి చెందిన కొండబోయిన రవీందర్ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆ కుటుంబాన్ని సోమవారం శ్రీలక్ష్మీనర్సింహదత్తసేన సేవా ట్రస్టు బృందం పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేశారు. అలాగే పొన్న స్వామి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం ఇచ్చారు. ట్రస్టు అధ్యక్షుడు నూతులకంటి ఈశ్వర్‌చంద్, సాంబయ్య, నూతులకంటి గౌరీశంకర్, రాజమహేంద్రవరపు హేమంత్, నూకల నరేశ్, శైలజ, నర్మద పాల్గొన్నారు.



ప్రగళ్లపల్లి జీసీసీ రేషన్ దుకాణం వద్ద బియ్యంకోసం వేచిఉన్న లబ్ధిదారులు

# రేషన్ బియ్యం కోసం పడిగాపులు

వాజేడు, జూన్ 9 : మూడు నెలల రేషన్ ఒకే నెలల ఇస్తుండడంతో లబ్ధిదారులు షాపుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. మండల వ్యాప్తంగా 12 షాపులు ఉండగా 8,398 మంది కార్డుదారులు ఉన్నారు. వారికి 4,54,605 కిలోల బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. ఒక్కో లబ్ధిదారుడు మూడు నెలల బియ్యం కోసం మూడు సార్లు ఆన్‌లైన్‌లో వేలిముద్ర పెట్టాల్సి వస్తున్నది. ఒక్కరోజులో 200 మందికి బియ్యం ఇచ్చే వారు సర్వర్ సమస్యతో ప్రస్తుతం 40 నుంచి 50 మందికి మాత్రమే ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రజలు రేషన్ షాపుల వద్ద గంటల తరబడి వేచిఉండాల్సి వస్తున్నది. ఈ విషయంపై తహసీల్దార్ వివరణ కోసం 'నమస్తే తెలంగాణ' ఫోన్లో ప్రయత్నం చేయగా ఆయన ఫోన్ ఎత్తలేదు. దీంతో గిర్దావర్ కుమారస్వామి సంప్రదించగా ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి బియ్యం వస్తాయని, ఏప్రిల్ 30 తర్వాత నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని రేషన్‌కార్డు వచ్చిన వారి జాబితా రేషన్ దుకాణాలకు చేరలేదని, వారికి బియ్యం ఇప్పుడు రావని సూచించారు.

## కేబుల్ ఆపరేటర్లపై పోల్ టాక్స్ భారం మోపొద్దు

భూపాలపల్లి రూరల్, జూన్ 9 : కేబుల్ ఆపరేటర్లపై ప్రభుత్వం పోల్ టాక్స్ భారం మోపడం సరికాదని ఇండి విజువల్ కేబుల్ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేషాల రమేశ్‌బాబు అన్నారు. సోమవారం సింగరేణి మినీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే నష్టాల్లో నడుపుతున్న కేబుల్ టీవీలపై ప్రభుత్వం టీఎస్ ఎన్పీడీసీఎల్ ద్వారా పోల్ టాక్స్ పేరుతో అదనపు ఆర్థిక భారం మోపడం హేయమైన చర్య అన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ విధానాన్ని నిలిపివేసి కేబుల్ ఆపరేటర్లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కేబుల్ ఆపరేటర్లు ఎమ్మెల్యే క్యార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

# గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



దరఖాస్తులు తీసుకుంటున్న తహసీల్దార్ సత్యనారాయణస్వామి

కాటారం/ మొగుళ్లపల్లి/ గణపురం, జూన్ 9 : కాటారం మండలంలోని దేవరాంపల్లి, గూడూరు రెవెన్యూ గ్రామాల పరిధిలో సోమవారం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇందులో పలువురు రైతులు, ప్రజలు భూ సమస్యలపై దరఖాస్తులు ఇచ్చారు. ఇదివరకు జరిగిన రెవెన్యూ సదస్సుల గ్రామాల ప్రజలు దరఖాస్తులు ఇవ్వడానికి రాగా గ్రామాల్లో సదస్సులు ముగిసిన తర్వాత తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 21 నుంచి దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు తెలిపారు. దేవరాంపల్లిలో 172, గూడూరులో 129 దరఖాస్తులు ఇచ్చినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. ఆర్ఐ వెంకన్న, భూభారతి మండల కో-ఆర్డినేటర్ కొట్టె శ్రీహరి పాల్గొన్నారు. అలాగే మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేట, పాత ఇస్సిపేట, చింతలపల్లి గ్రామాల్లో 203 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సునీత తెలిపారు. ఆర్ఐ శివ రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. గణపురం మండలకేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సదస్సుల్లో తహసీల్దార్ మధురకవి సత్యనారాయణస్వామి దరఖాస్తులను పరిశీలించి క్షేత్ర స్థాయిలో విచారణ చేసి పట్టాలు జారీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్ఐలు దేవేందర్, రహమత్ పాషా, సర్వేయర్ నిరంజన్. సిబ్బంది గుడాల తిరుపతి, మల్లేశ్ పాల్గొన్నారు.

## మావోయిస్టులకు సహకరించొద్దు

వెంకటాపురం(నూగూరు), జూన్ 9 : మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏటూరునాగారం ఏఎస్పీ శివంఉపాధ్యాయ అన్నారు. సోమవారం బోదాపురం జీపీ పరిధి సీతారామపురం గ్రామంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ అపరిచిత, అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో వాగులు ఉధృతంగా ప్రవహించే అకాశం ఉన్నందున వాగులను దాటే ప్రయత్నం చేయొద్దని, చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. అనంతరం గ్రామస్తులకు దోమ తెరలను పంపిణీ చేశారు. ఏఎస్పీ వెంట ఎస్సై తిరుపతిరావు, అలుబాక సీఆర్పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చిట్యాల, జూన్ 9 : బైక్ అదుపు తప్పి ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని జడల్‌పేట గ్రామ శివారు భీష్మనగర్ సమీపంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గణపురం మండలం మైలారం గ్రామానికి చెందిన దాసారం భద్రయ్య, ముత్యాల సంపత్ టేకుమట్ల మండలం కుందనపల్లి గ్రామానికి పని నిమిత్తం వెళ్లారు. తిరిగి వస్తుండగా భీష్మనగర్ సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడగా భద్రయ్య తలకు తీవ్ర గాయాలు కాగా సంపత్‌కు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో క్షతగాత్రులను భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. భద్రయ్య పరిస్థితి విషమంగా ఉన్న వైద్యులు తెలిపారు.

## డీటీపీ కోర్సును ప్రారంభించిన జీఎం

కృష్ణకాలనీ, జూన్ 9 : సింగరేణి స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో సోమవారం డీటీపీ కోర్సును జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోర్సులో ఫొటోషాప్, పేజిమేకర్, కోరల్ డ్రా, అడోబ్ ఇల్లస్ట్రేటర్, సాఫ్ట్‌వేర్‌లో శిక్షణ ఇస్తారని చెపాపరు.

## మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చెల్లించాలి

భూపాలపల్లి రూరల్, జూన్ 9 : నాలుగు నెలల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొరిమి సుగుణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ (అనుబంధం) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం డీఈవో రాజేందర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వరలక్ష్మి, ఉమాదేవి, బెల్లంకొండ స్వప్న, సంబడి చంద్రక్క, వేముల రాజేశ్వరి, సమత, సరోజన, కళావతి, మమత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

## ములుగు జిల్లాకు చేరిన వంట సామగ్రి

**292 పాఠశాలలకు పంపిణీ**

ములుగు, జూన్ 9 (నమస్తే తెలంగాణ) : విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన వంట సామగ్రి సోమవారం ములుగు జిల్లాకు చేరింది. జిల్లాలోని 292 పాఠశాలలకు కావాల్సిన తొమ్మిది రకాల వస్తువులు విద్యాశాఖ కమిషనర్ ద్వారా సరఫరా అయ్యాయి. వీటిని డిగ్రీ కళాశాల సమీపంలోని దివ్యాంగుల భవనంలో భద్రపర్చారు. పాఠశాలల వారీగా ఎంఈవో కార్యాలయాలకు తరలిస్తున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాలోని పాఠశాలలకు వంట సామగ్రిని సరఫరా చేసేందుకు విద్యాశాఖ కమిషనర్ టెండర్లు నిర్వహించగా ములుగు జిల్లాకు రూ.20 లక్షల సామగ్రి మంజూరైంది. వీటిలో 40 కిలోల నుంచి ఐదు కిలోల వరకు ఐదు రకాల గిన్నెలు, బియ్యం నిల్వ చేసుకునేందుకు స్టీల్ డబ్బాలు, భోజనం వడ్డించేందుకు, వంట చేసేందుకు అన్ని రకాల సామగ్రిని సరఫరా చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోగా అన్ని పాఠశాలలకు సామగ్రి చేరేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.



దివ్యాంగుల భవనంలో భద్రపర్చిన వంట సామగ్రి

## ఇండ్ల మంజూరుపై విచారణ జరపాలి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ములుగురూరల్, జూన్ 9 : ఇందిరమ్మ ఇండ్ల అవకతవకలపై విచారణ జరిపించాలని కలెక్టర్ దివాకరకు సోమవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేశ్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పేద ప్రజలకు కాకుండా కాంగ్రెస్ నాయకులకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. అధికారులు పంపిణీ చేయాల్సిన మంజూరు పత్రాలను కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో పంపిణీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులకు పత్రాలు ఇచ్చిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని జీపీల్లో లబ్ధిదారులకు న్యాయం జరుగకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ గండి కుమార్, నాయకులు వేములపల్లి భిక్షపతి, గొర్రె సమ్మయ్య, కొగిల మహేశ్, వాంకుడోత్ రాందాస్, ఉయ్యాల భద్రయ్య, గడ్డమీది భాస్కర్, పాడ్య చంటి, నూనవత్ రాజశేఖర్ ఉన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారయణ**

చిట్యాల, జూన్ 9 : అర్హులైన వారికి విడుతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, మూడు నెలల్లో నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం మండలంలోని ఒడితల, పాశిగడ్డతండా, గోపాలపూర్, కొత్తపేట, బావుసింగ్‌పల్లి, జడల్‌పేట, వరికోల్‌పల్లి, నైన్‌పాక, అందుకుతండా, గిద్దెముత్తారం, కాల్వపల్లి, నవాబుపేట, చిట్యాల, చల్లగరిగ గ్రామాల్లోని లబ్ధిదారులకు 357 ఇండ్ల మంజూరు పత్రాలు అందజేసి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గోపాలపూర్‌లో లబ్ధిదారులు ఎక్కువగా ఉండడంతో 20 ఇళ్లు మంజూరు చేసి త్వరలోనే పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్లు మంజూరైన వారు ఆలస్యం చేయకుండా పనులు ప్రారంభించాలన్నారు. విడుతల వారీగా డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో చిట్యాల ఏఎంసీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, తహసీల్దార్ షేక్ ఇమామ్ బాబా, ఎంపీడీవో జయశ్రీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్‌గౌడ్, టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే జీఎస్ఆర్

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**జ్యోతిష్యం చెప్పబడును**

★ శ్రీమేడారం ఓంశక్తి జ్యోతిషాలయం. విద్య, ఉద్యోగం, విదేశీప్రయాణం, వ్యాపారం, నాగదోషము, నరగోశ ప్రేమించుకున్న వారు దూరం అవటం, ఎన్ని సంబంధాలు వచ్చినా పెళ్లి కుదరకపోవడం, సంతానం లేకపోవడం, భార్య, భర్తల మధ్య కలహాలు రావటం మరియు ఎటువంటి సమస్యలకైన శాశ్వత పరిష్కారం 3 రోజులలో 100% చేయబడును. అన్ని మతాల వారికి జ్యోతిష్యం చెప్పబడును. గురూజీ కోయరాజు : రాజు గారు. సంప్ర: సెల్: 9912280354.
NTW-337017

**CHANGE OF NAME**

I, **THURPATI RAJU** S/o **SAMMAIAH,** R/o H. No. 1-9/2, Tekumatla Village & Mandal, Jayashankar Bhupalpally district. I have changed my daughter name from **THURPATI AMMULU** to **THURPATI SATHWIKA** for all Purposes.

**WANTED**

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

**WANTED**

jobs Apply Now!

★హనుమకొండలో గల ప్రముఖ కార్ డెకార్స్ నందు పనిచేయుటకు కార్ ఎలక్ట్రిషన్స్, సూపర్‌వైజర్స్ (Female) మరియు కార్ వాషింగ్ చేయుటకు Male/Female వర్కర్స్ కావలెను. సెల్: 7995621165, 6303776310.
NTW-307

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565